# త్వరలో 1,245 జూనియర్ లైన్‌మెన్ల పోస్టుల భర్తీ

ఈనాడు, హైదరాబాద్: ఏపీ ట్రాన్స్‌కోలో 1,245 జూనియర్ లైన్‌మెన్ల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ వీరు నియమితులు కాబోతున్నారు. అయితే, ఈ పోస్టులకు తాజాగా ఎటువంటి దరఖాస్తులు స్వీకరించరు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అర్హులని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. జూనియర్ లైన్‌మెన్ల పోస్టులకు సంబంధించి సమాచారం పొందుపరిచే కార్యక్రమం(డేటా ఎంట్రీ) ప్రస్తుతం పూర్తయిందని, త్వరలోనే ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్టు ఏపీట్రాన్స్‌కో సీఎండీ, ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.విజయానంద్. బుధవారం 'ఈనాడు'కు తెలిపారు. కొత్తగా ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబోమని వివరించారు.

# దక్షిణ సూడాన్‌కు రెండు విమానాలు

## • భారతీయులను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

దిల్లీ: యుద్ధంతో అతలాకుతలమైన దక్షిణ సూడాన్ నుంచి భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం రెండు సీ-17 సైనిక విమానాలను రాజధాని జుబాకు గురువారం పంపుతోంది. జుబాలో ఉన్న 300 మందికి పైగా భారతీయులను తీసుకొచ్చేందుకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయనతో పాటు, ఆర్థిక సంబంధాల కార్యదర్శి అమర్ సిన్హ కూడా జుబా వెళతారు. దక్షిణ సూడాన్‌లో సుమారు 600 మంది భారతీయులుండగా దాదాపు 300 మంది భారత్‌కు వచ్చేయడానికి రాయబార కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. విమానాలు గురువారం ఉదయం జుబా చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

# ఎన్టీఆర్ వైద్యసేవలో 'ఐవీఎఫ్'ను అనుమతించరూ

## • రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విజ్ఞప్తి

ఈనాడు, హైదరాబాద్: ఎన్టీఆర్ వైద్య సేవలో అందించే చికిత్సల్లో ఐవీఎఫ్(కృత్రిమ పిండం ద్వారా గర్భధారణ)ను చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు. రాష్ట్రంలో దాదాపు మూడు వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఐవీఎఫ్ విధానంలో సంతానాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నట్టు వారు చెబుతున్నారు. దాదాపు రూ.4 లక్షలు ఖర్చయ్యే ఈ చికిత్స తమకు భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం, రైల్వే శాఖ.. తమ పరిధిలోని ఉద్యోగులకు ఐవీఎఫ్ చికిత్స ఖర్చులు చెల్లిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై ఆలోచించి ఉద్యోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస...